## క్లుప్తంగా

### ప్రతి ఇంటికీ తాగునీరు


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

వజ్రపుకొత్తూరు: ఇంటింటా తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కొండవూరు సర్పంచ్ కొల్లి భాస్కరరావు అన్నారు. గురువారం కొండవూరు పంచాయతీ తుంభవానిపేటలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.8.6 లక్షలతో బోరు నిర్మాణ పనులకు సర్పంచ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇప్పిలి అప్పన్న, ఉప సర్పంచ్ ఆనందరావు, వాసు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నారాయణమ్మ

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే గ్రామీణ, మారుమూల ప్రాంతాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. గురువారం కొఠారీ పంచాయతీలో మూడున్నర లక్షలు జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు పనుల్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుక్క ధనలక్ష్మీ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, దుక్క ఆనంద్, ఉప్పాడ రాజారెడ్డి, కొచ్చెర్ల యాదవరెడ్డి, గుజ్జు వాసయ్య, దువ్వ కూర్మారావు, దల్లి లోహయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరి పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాద బాధితులకు సాయం


రేకులు అందజేస్తున్న దాతలు

కవిటి: మండలంలోని నెలవంకకు చెందిన పి.భైరమ్మ ఇల్లు గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు గురువారం తమవంతుగా రూ.12 వేలు విలువైన సిమెంట్ రేకులను అందజేశారు.

### కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం


సరోజినికి నగదు అందజేస్తున్న దాతలు

కవిటి : మండలంలోని కపాసుకుద్దికి చెందిన నెయ్యిల సరోజిని కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం మండలం కేశుపురానికి చెందిన కాళీమాత సేవాసమితి సభ్యులు తమవంతుగా రూ.10వేలు నగదు అందించారు. దాతలకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం


సాయాన్ని అందిస్తున్న సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు అనుబంధంగా నిర్మిస్తున్న అన్నిరకాల భవనాలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేయించుకోవాల్సిన బాధ్యత స్థానిక నాయకత్వంపై ఉందని సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సహలాలపుట్టుగలో నిర్మాణంలో ఉన్న గ్రామసచివాలయం, ఆర్బీకే భవనాలకు ప్రభుత్వ స్థలం లేని కారణంగా ప్రైవేట్ వ్యక్తుల వద్ద స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇందుకుగాను శ్యాంప్రసాద్‌రెడ్డి తనవంతుసాయంగా గురువారం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో నేతలు జి.రవిప్రధాన్, బద్దాయి మురళి, దట్టి అజయ్ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు


లికిత్, చైతన్య

ఇచ్ఛాపురం: శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీల్లో పురుషోత్తపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉప్పాడ లికిత్‌సాయిరెడ్డి, కె.చైతన్యలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ శివప్రసాద్, పీడీ సుధాకర్, తల్లిదండ్రులు కామేష్, నీరజ, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

### పూర్వ విద్యార్థుల ఔదార్యం

పలాస: మండలంలోని బొడ్డపాడుకు చెందిన తాని అరుణ భర్త ఇటీవల మృతిచెందడంతో ఆమె స్నేహితులు అండగా నిలిచారు. బొడ్డపాడు హైస్కూల్ 2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తక్షణ సాయం కింద రూ.ఐదు వేలు గురువారం అందించారు.

# రహదారులకు మహర్దశ


పూర్తయిన దబ్బలపాడు రహదారి పనులు

- గ్రామీణ ప్రాంతాల్లో తీరిన ప్రయాణ కష్టాలు
- పలాస నియోజకవర్గంలో రూ.58.33 కోట్ల నిధులతో పనులు

వజ్రపుకొత్తూరు: గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న రహదారులు నేడు సరికొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఓట్లు వేస్తేనే రోడ్లు వేస్తాం అన్న చంద్రబాబుకు, సెల్ఫీలు దిగే టీడీపీ నేతలకు దిమ్మ దిరిగేలా రాజకీయాలకు అతీతంగా రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. మైదాన ప్రాంతంతో పాటు ఉద్దానంలో ప్రధాన గ్రామాలను కలుపుతూ రహదారులు నిర్మిస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ ఇంప్లిమెంటేషన్ యూనిట్(ప్రాజెక్టు), పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రోడ్లు యుద్ధప్రాతిపదికన నిర్మించారు. దీంతో పల్లెవాసులకు ప్రయాణ కష్టాలు తీరాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పలాస నియోజకవర్గంలో పల్లె రహదారుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.


పాతటెక్కలి-యూఆర్‌కేపురం రహదారి

**చకచకా పనులు..**

- నువ్వలరేవు- రేగులపాడు రహదారికి రూ.20 కోట్లు వెచ్చించారు. పనులు 70 శాతంమేర పూర్తయ్యాయి.
- మందస మండలంలో 10కి.మీ. మేర చినబరంపురం రహదారి రూ.2కోట్లతో పూర్తి చేశారు. బెండిగేటు నుంచి కోసంగిపురం వరకు రూ.2 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేశారు.
- పలాస నియోజకవర్గంలో పీఐయూ(పీఆర్) ఆధ్వర్యంలో మరో రూ. 20 కోట్ల మేర పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. బెండిగేటు- దేవునల్తాడ వరకు దాదాపు 15కి.మీ. రహదారిని డబుల్‌లైన్‌గా మార్చేందుకు రూ.56 కోట్లు మంజూరు శారు.
- రూ.16 కోట్లతో వజ్రపుకొత్తూరు- అక్కుపల్లి- కాశీబుగ్గ డబుల్ లైన్ రహదారి పనులు 50 శాతం పూర్తయ్యాయి.
- ఎస్.వి.రహదారి నుంచి కొత్తపేట, పాతటెక్కలి - యూఆర్‌కేపురం, పొల్లాడ- దబ్బలపాడు, గరుడకండి-మహదేవిపురం, నువ్వలరేవు- రేగులపాడు, పలాస మండలంలో ఎన్‌హెచ్-5 నుంచి మాకన్నపల్లి, గరుడఖండి-బ్రాహ్మణతర్లా, బెండిగేటు జంక్షన్- కోసంగిపురం, బ్రాహ్మణతర్లా-నారాయణపురం పనులు కొన్ని పూర్తవ్వగా, మరికొన్ని తుది దశకు చేరుకున్నాయి.

**ఇబ్బందులు తీరాయి..**



పొల్లాడ-దబ్బలపాడు రహదారిపై వెళ్లాలంటే నరకం చూసేవాళ్లం. గత టీడీపీ ప్రభుత్వంలో పాలకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మంత్రి సీదిరి అప్పలరాజు చొరవతో రూ.34లక్షలతో రహదారి నిర్మించి అదుబాటులోకి తీసుకొచ్చారు. – పిన్నింటి జయరాం, ఎంపీటీసీ సభ్యుడు, సైలాడ

**మంత్రి చొరవతో..**



నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశాం. మంత్రి సీదిరి అప్పలరాజు చొరవతో ఈ పనులు పూర్తి చేయగలిగాం. ప్రజలు ఎక్కువ ఇబ్బంది పడుతున్న చోట్ల రోడ్లను పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చాం. – ఎస్. రామకృష్ణ, డీఈఈ(పీఐయూ), సోంపేట


నువ్వలరేవు- రేగులపాడు రహదారి నిర్మాణ పనులు

## భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ


ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కాశీబుగ్గ: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని బుధవారం పలాస కాశీబుగ్గలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించి కాశీబుగ్గ జామియా మసీద్ నుంచి పలాస జీడిపిక్క బొమ్మ వరకు జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో హఫీజ్ సాహెబ్, నెమలికొండ, బ్రాహ్మణతర్లా, తర్లాకోట, మందసకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రజలు శాంతిమార్గంలో అనుసరించి దేవునిలో ఐక్యమవ్వడమే మోక్షమార్గమని మహ్మద్ ప్రవక్త హితోపదేశం చేసినట్లు మత గురువు అనీస్‌ఖాద్రీ తెలిపారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఇచ్ఛాపురం పట్టణంలోని లాలాపేట మసీద్ నుంచి కస్పావీధి వరకు ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ అహ్మద్‌అలీ, ఎండీ ఫరీదుద్దీన్, షేక్ సర్ఫరాజ్, రఫీ, తాజ్‌ఖాన్, జోహార్‌ఖాన్, అలీమ్‌ఖాన్, అబ్దుల్లా, షఫీ పాల్గొన్నారు.


కాశీబుగ్గ: ఊరేగింపుగా వెళ్తున్న ముస్లింలు

## మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

కాశీబుగ్గ: ప్రతివీధిలోనూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు తెలిపారు. 18వ వార్డు రోటరీనగర్‌లో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ ప్రాంతాలను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు, స్థానిక కౌన్సిలర్ సనపల సింహాచలం, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ఫాదర్ రాజ్‌కుమార్, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, నాయకులు కవిటి సూర్యంబాబు, సంపతిరావు జయంత్‌కుమార్, ఏఈ అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.


రహదారి నిర్మిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

## మత్స్యకారుల సంక్షేమానికి కృషి

కవిటి: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ కవిటి మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. పెద్దకర్రివానిపాలెం గ్రామానికి చెందిన కర్రి కృష్ణారావు ఇటీవల కర్నాటకలోని మంగుళూరులో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. ఈ నేపథ్యంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రకటించిన వైఎస్సార్ మత్స్యకార బీమా పథకం కింద బాధిత కుటుంబానికి రూ.10లక్షల బీమా పరిహారానికి అర్హత సాధించారు. తొలి విడతగా మంజూరైన రూ.5లక్షల నగదును బాధిత కుటుంబసభ్యులకు ప్రకాష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ వై.సీలయ్య, పీపీసీఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, ఇద్దివానిపాలెం ఎంపీటీసీ ఎరిపిల్లి రామయ్య, వైఎస్సార్ సీపీ నేతలు దళ షణ్ముఖరావు, ఎస్‌పీ ప్రవీణ్, మేఘనాధం తదితరులు పాల్గొన్నారు.


బీమా పరిహారం అందిస్తున్న కడియాల ప్రకాష్

## అప్పయ్యదొర ఆశయాలు కొనసాగిస్తాం

కాశీబుగ్గ: తండ్రి, దివంగత మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్యదొర ఆశయాలను కొనసాగించేందుకు రాజకీయాల్లోకి పునఃప్రవేశం చేస్తున్నానని, అభిమానులు ఆదరించాలని అప్పయ్యదొర చిన్న కుమారుడు హనుమంతు విజయకుమార్‌దొర అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పద్మనాభపురం శివాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెక్కలి ఎమ్మెల్యేగా అప్పయ్యదొర అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఎంపీగా సైతం పనిచేశారని గుర్తుచేశారు. ఆరేళ్లుగా ఆరోగ్యం సహకరించకపోవడంతో ప్రజలతో మమేకం కాలేకపోయానని, ప్రస్తుతం ఆరోగ్యం కుదుట పడడంతో రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించేందుకు ముందుకు వస్తున్నానని చెప్పారు. సమావేశంలో పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సిర్ల బుజ్జి, పట్టణ నాయకులు బుదిరెడ్డి శ్రీనివాస్, చిత్రాడ ప్రవీణ్, టి.శ్రీను, అఖిలేష్ యాదవ్, చిన్నారి, బి.జన, గుంట ధర్మారావు, ప్రకాష్, రాజు, ఈశ్వరరావు, సీమల రమేష్, కైలాస్, తులసీదాస్, మధు, నారాయణ, చిరంజీవి, శ్రీనివాస్, రాజు, సోమేష్, కూర్మానావు, చిన్నబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హనుమంతు విజయకుమార్‌దొర

### షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో కిరణ్ దొళాయికి ద్వితీయ స్థానం


జ్ఞాపికతో కిరణ్ దొళాయి

కంచిలి: ఉద్దాన ప్రాంతం తలతంపర పంచాయతీ లండపుట్టుగ గ్రామానికి చెందిన కిరణ్ దొళాయి అనే యువకుడికి ఏపీ టీడీసీ నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కింది. ఈ మేరకు రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి ఆర్.కె.రోజా ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అమరావతిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి అందజేశారు. కిరణ్‌ను సర్పంచ్ డాక్టర్ జగబంధు దొలాయి గురువారం అభినందించారు.

### పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

సోంపేట: ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సోంపేట మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు చంద్రశేఖర్, నారాయణరావు, దాలిబందు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటా వైద్యపరీక్షలు


మండపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష పరీక్షలు

ఇచ్ఛాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమంలో భాగంగా ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కొళిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.కళ్యాణి తెలిపారు. గురువారం తేలుకుంచి, మండపల్లి గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు.ఈ నెల 30 నుంచి మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి.పురంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ డొక్కరి తులసి బలరాం ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కె.కమలాభాయి, హెచ్.వి. కె.భాగ్యవతి, ఏఎన్ఎం ఎస్.పుణ్యవతి, ఎం.ఎల్.హెచ్.పి.జి.శైలజ, ఆశ కార్యకర్తలు జి.ఊర్వశి, సీహెచ్.సీత, ఆర్.భైరమ్మ పాల్గొన్నారు.

పలాస: మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు లేబర్ కాలనీలో ఉచితంగా బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి, వార్డు ఇన్‌చార్జి అంబటి ఆనందరావు, వలంటీర్లు శ్రావణి, రాణి, మల్లా దిలీప్ పాల్గొన్నారు.

### ఆదివాసీలకు అన్యాయం చేయవద్దు


మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు

కాశీబుగ్గ: బోయ, వాల్మీక కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదివాసీలకు అన్యాయం చేయవద్దని ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు అన్నారు. గురువారం కాశీబుగ్గలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఆయా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనివల్ల నిరుపేదలైన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చడం దారుణమన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు చొరవతీసుకుని ఆదివాసీలకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో జిల్లా ఆదివాసీల జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు, పలాస నియోజకవర్గ ఆదివాసీల అధ్యక్షుడు పెద్దింటి ఈశ్వరరావు, సభ్యులు మోహనరావు, సవర రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణపతి పూజలు

వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. గురువారం పలుచోట్ల మండపాల వద్ద అన్న సమారాధన, కుంకుమ పూజలు, లడ్డూ వేలం పాటలు జరిగాయి. సాయంత్రం నిమజ్జనోత్సవాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారధి తురాయివీధిలో అన్నదానం


ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురంలో సామూహిక కుంకుమ పూజలు


కంచిలి: ఎస్.ఆర్.సి.పురం కాలనీలో ఊరేగింపులో పాల్గొన్న యువత


కాశీబుగ్గ: రామకృష్ణమార్గ్‌లో అన్నదానం


కాశీబుగ్గ: సొంతం చేసుకున్న లడ్డూతో భక్తులు


కాశీబుగ్గ: కేటీరోడ్డులో యువకుల నృత్యోత్సాహం


కాశీబుగ్గ: పలాస పెద్దవీధిలో ఊయలలో గణనాథుడు

## అభ్యుదయ కవి జాషువా

టెక్కలి: అభ్యుదయ కవి గుర్రం జాషువా అని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. జాషువా జయంతి సందర్భంగా కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యుదయం కోసం జాషువా చేసిన రచనలను వివరించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు వై.లీలాపద్మజ, వి.తిరుమలరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ల్యాబ్‌పాల్, ఎ.రామారావు, కె.గొల్ల, కసవయ్య, బి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి సుహాస్‌చంద్ ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.


టెక్కలి: గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

## తీరిన తాగునీటి సమస్య

మందస: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ఎట్టకేలకు తాగునీటి సమస్య తీరింది. గతంలో పలుమార్లు బోర్లును తవ్వినా నీరు పడలేదు. దీంతో ఎంపీపీ డొక్కరి దానయ్య ఎంపీపీ నిధులు మంజూరు చేసి ఎంపీడీఓ సమావేశ మందిరం దగ్గరలో బోరును తవ్వించగా పుష్కలంగా నీరు పడింది. ఈ పనులను గురువారం ఎంపీపీతో పాటు ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, ఎంపీటీసీ కంచిబెహరా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన మండల కార్యదర్శి శానాపతి కిషోర్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, దువ్వ జగదీష్ పరిశీలించారు.


పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ దానయ్య తదితరులు